సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం | 29 | డిసెంబర్ | 2023



ల్యాబ్, ఐ బ్యాంక్‌కు రూ.3 లక్షలు


బాలాజీచెరువు (కాకినాడ): బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు రూ.2 లక్షలు, ఐ బ్యాంక్‌కు రూ.లక్ష చొప్పున ఆయన తనయుడు డాక్టర్ రాధా దామోదర్ విరాళం అందజేశారు.



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి కాశీ విశ్వనాథ రవికుమార్ దంపతులు (రావులపాలెం) గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 12,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు గురువారం 12,300 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు 3,800, సెంట్రల్ 2,500, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) జి.నరసింహులు ఈ విషయం తెలిపారు. ఈ పరీక్షలు, విద్యా శాఖ ద్వారా పశు సంవర్థక శాఖ పోస్టుల భర్తీ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలోని రాజీవ్ గాంధీ విద్యా సంస్థల్లో ఈ పరీక్షలకు హాజరయ్యే హాల్ టిక్కెట్టు, ప్రభుత్వం గుర్తించే ఫొటో గుర్తింపు కార్డుతో అరగంట ముందే అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్నారు. ఆబ్జెక్టివ్ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలనూ అనుమతించబోమని చెప్పారు. ఈ పరీక్షలకు విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, పోలీసు బందోబస్తు, వైద్య శిబిరం తదితర ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం 258 మంది, మధ్యాహ్నం 211 మంది, శనివారం ఉదయం 440 మంది, మధ్యాహ్నం 116 మంది చొప్పున ఈ పరీక్షలకు హాజవుతారని ఏపీపీఎస్సీ అధికారులు తెలిపారు. ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి గిరిజారాణి, ఏఎస్‌ఓ అనిల్ కుమార్, డీఎస్పీ రామవర్మ, ఎంపీహెచ్‌ఓ జాన్సన్ రాజు, ఈపీడీసీఎల్ డీఈఈ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): స్థానిక అల్యూమినియం అసోసియేషన్ హాలులో గురువారం జరిగిన జిల్లా మహిళా చదరంగం పోటీల్లో 25 మంది పాల్గొన్నారు. ఐదు రౌండ్లలో నిర్వహించిన ఈ పోటీల్లో బి.జ్ఞాన అన్విత, కె.రష్మి, బి.ప్రవల్లిక, బి.వినూత్న విజేతలుగా నిలిచారు. వీరికి యూబీఐ సీనియర్ మేనేజర్ పీఆర్‌వీ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. వీరు ఈ నెల 31న నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మన జిల్లా నుంచి పాల్గొంటారని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

రైతు మురిసేలా..

- వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి
- సాగును ప్రోత్సహించేందుకు రైతు భరోసా
- ప్రభుత్వ చర్యలతో పెరిగిన ధాన్యం దిగుబడి
- విపత్తుల సమయంలో అన్నదాతలకు అండ



వరి కోతలను, ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అనేక సంస్కరణలకు నాంది పలికింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సాగుకు అడుగడుగునా ప్రోత్సాహం అందించింది. వైఎస్సార్ రైతు భరోసాతో సాగుకు సాయం చేసింది. రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందజేస్తోంది. గోదావరి వరదలు, తుపాను, భారీ వర్షాల వంటి ప్రకృతి విపత్తుల వేళ.. అధికార యంత్రాంగాన్ని పంపి రైతులకు అండగా నిలుస్తోంది. పంట రుణాలు అందజేసి చేదోడువాదోడుగా నిలుస్తోంది. ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసి ఆర్థికంగా ఆదుకుంటోంది. ఖరీఫ్, రబీ సీజన్లకు సకాలంలో సాగునీరు అందించి నీటి కష్టాలకు చెక్ పెట్టింది. ప్రభుత్వ చర్యల ఫలితంగా ఈ ఏడాది జిల్లాలో ధాన్యం దిగుబడులు గణనీయంగా పెరిగాయి. దీనినిబట్టి వ్యవసాయ రంగం పరిస్థితి ఎంతగా ప్రగతి బాటలో పయనిస్తోందో అర్థం చేసుకోవచ్చు.

రైతుకు 'భరోసా'

పంట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా ఆర్థిక సాయం చేస్తోంది. జిల్లావ్యాప్తంగా సుమారు 9,590 మంది రైతుల ఖాతాల్లో రూ.7.19 కోట్లకు పైగా ఆర్థిక సాయం జమ చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దీనిని క్రమం తప్పకుండా అమలు చేస్తోంది. ఫలితంగా పంట సాగుకు అవసరమైన నగదు సమకూరుతుండటంతో అప్పులు చేసే అవసరం లేకుండా పోయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత

విత్తనం నుంచి పంట విక్రయం వరకూ ప్రతి అంశంలోనూ రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల సమయంలో దెబ్బ తిన్న పంటలకు అదే సీజన్‌లో పరిహారం అందించి అండగా నిలుస్తోంది. మే, జూన్, జూలై, ఆగస్టు నెలల్లో అకాల వర్షాలకు దెబ్బ తిన్న ఉద్యాన పంటలకు సంబంధించి 673 మంది రైతులకు రూ.68 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసింది.

అందుబాటులో ఎరువులు

పంట దిగుబడిలో కీలక ప్రాధాన్యం ఉన్న ఎరువులను ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభానికి ముందే ప్రభుత్వం ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచింది. రబీలో 58,356 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటికే 21,345 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. యూరియా 9,087 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,637, ఎంఓపీ 2,287, ఎస్ఎస్‌పీ 1,920 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి.

రుణ పరపతి

పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడులకు అనుగుణంగా రుణ పరిమితిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వరితో పాటు ఉద్యాన, ఆక్వా రంగాలకు రుణ పరిమితిని ఎకరాకు రూ.10 వేలకు పెంచుతూ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకుంది. వరి రైతుకు ఎకరాకు రూ.38 వేలు ఉండగా.. రూ.45 వేలకు పెంచారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్, రబీలో సుమారు 1,95,396 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. రుణ పరిమితి పెంచడం ద్వారా 1,25,000 మంది రైతులకు ప్రయోజనం చేకూరింది.



కొరత ఉన్నా.. నీటి విడుదల

గోదావరి డెల్టా తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ జిల్లాల పరిధిలో 8,96,507 ఎకరాల రబీ ఆయకట్టు ఉంది. పంటల సాగుకు 91.35 టీఎంసీల సాగునీటి ఆవశ్యకత ఉండగా, 82.49 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగిలిన 8.86 టీఎంసీలకు కొరత ఏర్పడుతుందని ముందుగానే అంచనా వేసిన అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు రంగం సిద్ధం చేసింది. ప్రతి నీటి బొట్టూ వినియోగించుకునేలా రైతుల్లో విస్తృత అవగాహన తీసుకువచ్చింది. నవంబర్ 30లోగా ఖరీఫ్ పంట కోతలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడంతో నీటి ఎద్దడిని అధిగమించేలా ప్రణాళికలు రూపొందించింది.

పెరిగిన 'వరి' దిగుబడి

సకాలంలో సాగునీటి విడుదల.. మూడు పంటల దిశగా ప్రభుత్వ సన్నద్ధత.. పంటకు అనువైన సమయంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అందజేత.. ఆపై వరుణడి కరుణ.. ఇలా ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచీ అనుకూల పవనాలు వీయడంతో 2023 ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో వరి దిగుబడులు వచ్చాయి. గత ఏడాది ఎకరానికి 32 బస్తాల వరి దిగుబడి రాగా.. ప్రభుత్వం తీసుకున్న రైతు అనుకూల చర్యలతో ఈ ఏడాది అది 38 నుంచి 40 బస్తాలకు పెరిగింది. దీనినిబట్టి రైతులకు ఏ స్థాయిలో మేలు జరిగిందో అర్థం అవుతోంది.

మైనర్ ఇరిగేషన్‌కు మహర్దశ

ఈ ఏడాది మైనర్ ఇరిగేషన్‌కు మహర్దశ పట్టింది. రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల పరిధిలో ఈ వ్యవస్థ శాశ్వత ప్రక్షాళనకు కీలక ముందడుగు పడింది. రూ.38.29 కోట్లతో 53 మైనర్ ఇరిగేషన్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. పనుల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

తుపానుపై అప్రమత్తం

మిచాంగ్ తుపాను ప్రభావంతో చినుకు ప్రారంభమైనప్పటి నుంచే ప్రభుత్వ సూచనల మేరకు అధికారులు అప్రమత్తయ్యారు. శాఖల వారీగా విధులు కేటాయించారు. ప్రజలకు, రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, రైతులకు అండగా నిలిచారు. తుపాను తెరిపిచ్చిన వెంటనే పంట నష్టాల అంచనాల తయారీలో తలమునకలయ్యారు. జిల్లాలో 33 శాతం పైబడి సుమారు 14,471 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బ తిన్నాయని గుర్తించారు. వీటికి సంబంధించి 16,118 మంది రైతులకు రూ.21.46 కోట్ల మేర నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

ధాన్యం కొనుగోలుతో అండ

పంట కోతలు ప్రారంభమైనప్పటి నుంచీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచారు. దళారుల బారిన పడి రైతులు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల ద్వారా 2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా.. ఇప్పటి వరకు 41,464 మంది రైతుల నుంచి 2,01,541 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. 29,406 ఎఫ్‌టీఓలకు గాను రైతుల ఖాతాల్లో రూ.309.55 కోట్లు జమ చేశారు.

విపత్తులో రైతులకు దన్ను

తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేశారు. 20 శాతం తేమ ఉన్నా.. నామమాత్రపు ధాన్యం మినహాయించి గిట్టుబాటు ధరకే కొనుగోలు చేసి దన్నుగా నిలిచారు. జిల్లా వ్యాప్తంగా 13 వేల టన్నులకు పైగా తడిసిన ధాన్యం కొనుగోలు చేశారు. తుపాను నేపథ్యంలో ఈ నెల 3 నుంచే ఆఫ్‌లైన్‌లో తేమ శాతంతో పని లేకుండా కొనుగోళ్లు చేపట్టారు. ఇందుకు గాను ప్రతి మండలానికి ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 70,827 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు జరగగా, తుపాను నాటికే 46,416 హెక్టార్లలో మాసూళ్లు పూర్తయ్యాయి. 24,316 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉన్నట్లు నిర్ధారించారు. రేయింబవళ్లు శ్రమించి ఈ నెల ఎనిమిదో తేదీకే 23,958 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, మిల్లులకు తరలించారు.



తడిసిన ధాన్యం పరిశీలించి, రైతులకు ధైర్యం చెబుతున్న కలెక్టర్ కె.మాధవీలత (ఫైల్)



చాగల్లులో ధాన్యం తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)

పేదల ఉన్నత విద్యకు ప్రభుత్వ దీవెన

- నేడు జగనన్న విద్యా దీవెన నాలుగో విడత నిధులు విడుదల
- జిల్లాలోని విద్యార్థులకు రూ.19.55 కోట్ల లబ్ధి
- 24,462 మంది తల్లుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్



రాజమహేంద్రవరంలో మూడో విడత విద్యా దీవెన చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఫీజుల భారంతో పేద విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోకూడదనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన నాలుగో విడత నిధులు శుక్రవారం విడుదల కానున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా జగనన్న విద్యాదీవెన నిధులను అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయనున్నారు. ఈ పథకం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించేందుకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

పేద విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది. ఫీజులు చెల్లించలేక ఆయా వర్గాలకు చెందిన విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోకూడదనే దృఢ సంకల్పంతో జగనన్న విద్యాదీవెన పథకాన్ని (ఫీజు రీయింబర్స్‌మెంట్) అమలు చేస్తోంది. అలాగే వివిధ కోర్సులు చదువుతున్న అర్హులైన విద్యార్థులందరికీ ఆహారం, హాస్టల్, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ రెండు పథకాలకు క్రమం తప్పకుండా నిధులను విడుదల చేస్తోంది. తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ తదితర వర్గాల విద్యార్థులు డ్రాపౌట్లు లేకుండానే ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ అంతకంటే ఎక్కువ కోర్సులు చదువుతున్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద ప్రస్తుత విద్యా సంవత్సరంలో మొదటి విడతగా ఈ ఏడాది మార్చి 19న జిల్లాలోని ఆయా సామాజికవర్గాలకు చెందిన 32,592 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.23.69 కోట్లు జమ చేశారు. రెండో విడతగా మే 24న 33,058 మంది విద్యార్థులకు రూ.23.87 కోట్లు జమ చేశారు. వివిధ కారణాలతో విద్యా దీవెన అందని 2,196 మంది విద్యార్థులకు ఆగస్టు 24న రూ.2.61 కోట్లు అందించారు. మూడో విడతగా ఆగస్టు 28న 30,729 మందికి రూ.22.43 కోట్లు జమ చేశారు. నాలుగో విడతగా 24,462 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.19.55 కోట్లు జమ చేయనున్నారు.

సామాజికవర్గాల వారీగా చేకూరనున్న లబ్ధి (రూ.కోట్లలో)

సామాజికవర్గం	విద్యార్థులు	తల్లులు	లబ్ధి
ఎస్సీ	7,037	6,299	5.16
ఎస్టీ	148	133	0.07
బీసీ	10,777	9,906	7.50
ఈబీసీ	2,904	2,757	2.64
ముస్లిం	527	485	0.40
కాపు	5,151	4,757	3.64
క్రిస్టియన్	138	125	0.10

26,682 మందికి ప్రయోజనం



జగనన్న విద్యా దీవెన నాలుగో విడత కింద జిల్లాలోని 26,682 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. వారి తల్లుల ఖాతాల్లో రూ.19.55 కోట్లు జమ కానున్నాయి. అర్హులైనప్పటికీ పలు సాంకేతిక కారణాలతో విద్యా, వసతి దీవెన నిధులు జమ కాని విద్యార్థుల నుంచి వెంటనే అబ్జెక్షన్ రైజ్ చేసి, వారికీ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.సందీప్, జేడీ, సాంఘిక సంక్షేమ శాఖ, తూర్పు గోదావరి

వచ్చే నెలలో భారీగా సంక్షేమ పథకాలు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు
- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు



సీఎం జగన్ సమీక్షలో పాల్గొన్న మంత్రి వేణు, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు, జి.శ్రీనివాసనాయుడు, కలెక్టర్ మాధవీలత, కో ఆర్డినేటర్లు డాక్టర్ గూడూరి, చందన తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ స్వరాజ్య స్థాపన, మహిళల ఆర్థిక, సామాజిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెలలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టనున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమాలపై సీఎం వైఎస్ జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు గురువారం దిశానిర్దేశం చేశారు. ఇందులో కలెక్టరేట్ నుంచి మంత్రి వేణు, రాజానగరం, గోపాలపురం, నిడదవోలు ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, జి.శ్రీనివాసనాయుడు, కలెక్టర్ కె.మాధవీలత, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ, రూరల్ కో ఆర్డినేటర్లు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, చందన నాగేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ, వైఎస్సార్ పెన్షన్ కానుక కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.2,750 పింఛనును వచ్చే నెల నుంచి రూ.3 వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచుతూ, ఇచ్చిన హామీ నెరవేరుస్తోందని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ కింద స్వయం సహాయక పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు జనవరి 23 నుంచి ఆర్థిక ప్రయోజనం అందించనున్నారని తెలిపారు. అలాగే, వైఎస్సార్ చేయూత పథకాన్ని ఫిబ్రవరి 5 నుంచి ప్రభుత్వం అందించనుందని చెప్పారు. సామాజిక న్యాయానికి ప్రతిరూపమైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో విజయవాడలో 19 ఎకరాల్లో రూ.404 కోట్లతో 125 అడుగుల విగ్రహాన్ని జనవరి 19న సీఎం జగన్ ఆవిష్కరిస్తారని మంత్రి వేణు తెలిపారు. ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్లే కార్యాచరణ ప్రణాళికపై సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారని చెప్పారు. విశ్వసనీయతకు మారుపేరు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి, అన్ని సంక్షేమ పథకాలనూ అర్హులైన లబ్ధిదారులకు అందించిన ఘనత సాధించారని అన్నారు. ఈ పథకాలపై ముందస్తుగా ప్రజల్లో విస్తృత ప్రచారం చేయడంతో పాటు, లబ్ధిదారులకు ప్రయోజనం అందించే క్రమంలో ఈ పథకం ప్రయోజనంతో పాటు ముఖ్యమంత్రి లేఖ, వీడియో సందేశం, అనంతరం లబ్ధిదారుల అభిప్రాయం తెలుసుకునే కార్యక్రమాలు చేపడతామని వివరించారు. ఫిబ్రవరి 16న వలంటీర్లను సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సత్కరిస్తామని మంత్రి వేణు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ ఎస్‌వీవీఎస్ మూర్తి, డీఎల్‌డీఓ పి.వీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

కీలక దశకు మోరంపూడి ఫ్లై ఓవర్ పనులు

- గడ్డర్ల బిగింపు ప్రారంభం
- పరిశీలించిన ఎంపీ భరత్‌రామ్



మోరంపూడి ఫ్లై ఓవర్ గడ్డర్ల పనులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: నగరంలో చేపట్టిన మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో అత్యంత కీలకమైన గడ్డర్ల ఏర్పాటు ప్రక్రియకు గురువారం శ్రీకారం చుట్టారు. ఈ పనులను ఎంపీ మార్గాని భరత్‌రామ్ దగ్గరుండి పర్యవేక్షించారు. గడ్డర్ల ఏర్పాటుతో బ్రిడ్జికి ఒక రూపం వచ్చినట్టయ్యింది. గడ్డర్ల ఏర్పాటు పనులు నాలుగు రోజుల పాటు కొనసాగుతాయని, మొత్తం 16 గడ్డర్లు ఏర్పాటు చేస్తామని కాంట్రాక్టు సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎంపీ భరత్‌రామ్‌కు తెలిపారు. గడ్డర్ల ఏర్పాటు పూర్తయిన తరువాత శ్లాబ్ నిర్మాణానికి శ్రీకారం చుడతామని చెప్పారు. మరో రెండు మూడు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావచ్చని భావిస్తున్నామన్నారు. బ్రిడ్జి శంకుస్థాపన నుంచి దశల వారీగా ప్రతి అంశంలోనూ ఎంపీ తమకు అన్ని విధాలా సహకారం అందిస్తుండటంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ, మోరంపూడి జంక్షన్ వద్ద అనేక ప్రమాదాలు జరిగి, ఎంతో మంది మృత్యువాత పడ్డారని, దీనిని దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, ఇక్కడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి మంజూరైనప్పటికీ, ఆ పార్టీ నేతలు పెద్దగా దృష్టి సారించకపోవడంతో రద్దయ్యిందని గుర్తు చేశారు. ఒకసారి రద్దయితే తిరిగి మంజూరవడం చాలా కష్టమన్నారు. అయితే, ఇక్కడి పరిస్థితిని కేంద్ర జాతీయ రహదారుల శాఖకు, సంబంధిత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పాటు లోక్‌సభలో పదేపదే వివరించి, ఎట్టకేలకు మంజూరు చేయించగలిగామని చెప్పారు. ఈ విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సహకారం అందించారని తెలిపారు. మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయిన తర్వాత బొమ్మూరు, వేమగిరి, లాలా చెరువు, దివాన్ చెరువు జంక్షన్ల వద్ద మంజూరైన వంతెనలకు కూడా శంకుస్థాపనలు చేసి, పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోగా శంకుస్థాపన చేయాలనేది తన ఆకాంక్ష అని ఎంపీ భరత్ అన్నారు. మోరంపూడి బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ఐరన్ తదితర పనులు చేసుకునేందుకు తమ మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో అనువైన స్థలాన్ని ఎంపీ భరత్‌రామ్ ఉచితంగా సమకూర్చడం విశేషం. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుర్రం గౌతమ్, ఎన్వీ శ్రీనివాస్, గేడి అన్నపూర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సారా రహితం కావాలి

- బట్టీలపై ప్రతి రోజూ దాడులు చేయాలి
- రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలి
- వార్షిక నేర సమీక్షలో ఎస్పీ జగదీష్



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సారా బట్టీలపై ప్రతి రోజూ దాడులు నిర్వహించి, జిల్లాను సారా రహితం చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. జాంపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాలులో 2023వ సంవత్సరం వార్షిక నేర సమీక్ష గురువారం జరిగింది. ఈ సందర్భంగా చాలా కాలం నుంచి దర్యాప్తు చేయకుండా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ప్రతి ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో నిర్ణీత గడువులోగా చార్జిషీట్ ఫైల్ చేయాలని ఆదేశించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని, గంజాయి కేసులలో పెండింగ్ అరెస్టు వారెంట్లను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. తీవ్రమైన కేసులలో నేరారోపణ జరిగేలా చూడాలన్నారు. కేసు ఎక్విటల్ అయితే డీజీపీ నుంచి క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. కోర్టులో స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు తగిన శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకుని రికవరీ శాతం పెంచాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను ముమ్మరం చేసి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయాలని చెప్పారు. సారా, గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని, మహిళల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మిస్సింగ్ కేసులు త్వరితగతిన దర్యాప్తు చేసి, కేసుల సంఖ్యను తగ్గించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలపై దృష్టి సారించాలని చెప్పారు. వాహనాల వేగాన్ని తగ్గించేందుకు స్టాపర్లు, లైటింగ్ ప్రమాదాల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రౌడీ షీటర్లపై నిఘా పెట్టడం ద్వారా శాంతిభద్రతలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు సమాచారం సేకరించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు జి.వెంకటేశ్వరరావు, ఎస్ఆర్.రాజశేఖర్ రాజు, ఎల్.చెంచిరెడ్డి, జిల్లాలోని డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

30న 'నన్నయ'లో చిరుధాన్యాలపై వర్క్‌షాప్



బ్రోచర్‌ని విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'మిలెట్స్ ఫర్ హెల్త్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం విడుదల చేశారు. 'ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్ - 2023' సందర్భంగా గోదావరి రీజనల్ క్లస్టర్ గ్రూప్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ సహకారంతో ఈ వర్క్‌షాప్ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి జయనిర్మల పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో రుణాలు



డీసీసీబీ మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ ఆకుల వీర్రాజు



మహాజన సభలో పాల్గొన్న సహకార సంఘ అధ్యక్షులు, సీఈఓలు

డీసీసీబీ చైర్మన్ ఆకుల

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రైతులకు కావాల్సిన అన్నీ రుణాలు సహకార సంఘాల ద్వారా సకాలంలో అందిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. కాకినాడలో గురువారం ఒక ఫంక్షన్ హాల్‌లో డీసీసీబీ 127వ మహా జనసభ నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు రూ.353 కోట్ల పంట రుణాలు, రబీలో ఇప్పటి వరకూ రూ.79 కోట్లు ఇచ్చామన్నారు. దీర్ఘకాలిక రుణాలు రూ.985 కోట్లు అందజేసినట్టు తెలిపారు. రైతులకు తక్కువ వడ్డీకి బంగారు నగల తాకట్టుపై రూ.536 కోట్లు, చేనేత, సహకార సంఘాలకు రూ.17.88 కోట్లు రుణాలుగా ఇచ్చామన్నారు. చేనేత సభ్యులకు ముద్రా రుణాల కింద 70.50 లక్షలు ఇచ్చినట్టు చెప్పారు. జగనన్న పాలవెల్లువ పథకంలో గేదెలు కొనుగోలు చేసేకొనేందుకు రైతులకు రూ. 280 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా వ్యవసాయ పరికరాలు ఏర్పాటు చేసుకొనేందుకు రైతు గ్రూపులకు రూ.7.98 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. జగనన్న తోడు పథకంలో చిరు వ్యాపారులకు రూ.1.70 కోట్లు ఇచ్చామన్నారు. రైతుల పిల్లలు చదువుకొనేందుకు విద్యా రుణాలు ఇస్తున్నామన్నారు. రైతు నేస్తం పథకం ద్వారా స్వంత భూమి ఉన్న రైతుకు ఎకరానికి రూ.8 లక్షల వరకూ రుణం ఇస్తామన్నారు. ఈ ఏడాది ప్రారంభించిన పథకంలో ఇప్పటికే రూ.103 కోట్లు రుణాలుగా ఇచ్చామన్నారు. బ్యాంకు వార్షిక నివేదికను డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు సహకార సంఘ అధ్యక్షులు రైతు నేస్తం పథకంలో రుణం రైతులకు ఎంతో ఉపయోగపడుతోందని, కానీ షేరు క్యాపిటల్ కింద సుమారు రూ.లక్ష బ్యాంకులో ఉండిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పథకంలో షేర్ క్యాపిటల్ తగ్గించే విధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ పాలక వర్గ సభ్యులు పులి మధుసుధాకర్‌బాబు, సయ్యద్ మోహిద్దీన్ , బండారు సత్తిరాజు, ఇళ్ల సత్యగోపాలకృష్ణ, టి.శ్రీనివాసరావు, పోలిశెట్టి సోమరాజు, ఆప్కాబ్ నోడల్ ఆఫీసర్ కృష్ణారావు పాల్గొన్నారు.

ఈసారి గెలిచేది వైఎస్సార్ సీపీయే..

- ఎమ్మెల్యే రాపాక
- వచ్చే నెల 5న రాజోలులో బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: గత రెండు పర్యాయాలు రాజోలు నియోజకవర్గంలో ఓటమి చెందామని, ఈసారి భారీ మెజారిటీతో ఇక్కడ గెలిచేది వైఎస్సార్ సీపీయేనని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కత్తిమండ గ్రామం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వచ్చే నెల 5వ తేదీన రాజోలు నియోజకవర్గంలో జరుగనున్న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్సు యాత్రను విజయవంతం చేయడాన్ని ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పేర్కొన్నారు. మొక్కుబడి కార్యక్రమాలకు స్వస్తి చెప్పి వచ్చే ఎన్నికలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. గతంలో రోడ్లు వేయలేదనే ప్రతిపక్షాలు విమర్శించేవి తప్ప మరొకటి లేదని, అయితే ప్రస్తుతం నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో రోడ్ల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ప్రతిపక్షాలకు దీటుగా సమాధానం ఇవ్వాలని సూచించారు. వచ్చే ఎన్నికలలో విజయం సాధించి జగన్ మరొకసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింతగా అభివృద్ధి పథంలో సాగుతుందన్నారు. ప్రతిపక్షాలకు అవకాశం ఇస్తే ఇప్పుడున్న పథకాలు రద్దు చేస్తారని అన్నారు. సంక్షేమ పథకాలే ప్రజలకు అన్ని విధాలుగా ఆసరాగా ఉంటాయన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు బల్ల ప్రసన్నకుమారి, దొండపాటి అన్నపూర్ణమ్మ, మట్టా శైలజ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన్నరాజా, పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, మంగెన సింహాద్రి, రాపాక వెంకట్రామ్, పాటి శివ, కంచర్ల శేఖర్, యెనుముల నారాయణస్వామి పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఆర్ఎంసీ గ్రౌండ్ ఆవరణను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల మూడో తేదీన కాకినాడ రానున్న సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు గురువారం పర్యవేక్షించారు. ఆర్ఎంసీ గ్రౌండ్ ఆవరణను అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా అక్కడ చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. సీఎం పాల్గొనే బహిరంగ సభా స్థలి వద్ద చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఆ ప్రాంతంలో కార్పొరేషన్ పరంగా చేపట్టాల్సిన పారిశుధ్యం, ఇతర పనులపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ సామాజిక పింఛన్ సొమ్మును రూ.2,750 నుంచి రూ.3,000కు పెంపుదల చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కాకినాడ నుంచి ప్రారంభిస్తారన్నారు. ముత్తా గోపాలకృష్ణ వారధి, రాగిరెడ్డి కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్‌లను కూడా సీఎం ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి.సత్యకుమారి, డీసీపీ హరిదాస్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఈఈ మాధవి, శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని, రాంబాబు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో మరలా సీఎం జగనే

జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్



విఘ్నేశ్వరుని సన్నిధిలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులు

అయినవిల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుస్తారని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. గురువారం ఆయన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపొందాలని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత జెడ్పీ చైర్మన్‌కు ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఏ సీఎం చేయనట్టుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారని, అర్హులందరికీ నేరుగా లబ్ధి చేకూర్చారన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డే కావాలని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో మొత్తం 175 సీట్లు వైఎస్సార్ సీపీకే వస్తాయన్నారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు, అభిమానులు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జన్మదిన వేడుకలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఈ ధోరణి ప్రభుత్వ విద్యకు ప్రమాదం



ఎస్ఎఫ్ఐ జ్ఞాపికలను అతిథులకు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: విద్యారంగంలో వినాశకర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, ఇది రాబోయే రోజుల్లో ప్రభుత్వ విద్యకు ప్రమాదకరమని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున ప్రైవేట్ యూనివర్సిటీలు, కాలేజీలు, పాఠశాలలు విచ్చలవిడిగా వచ్చాయన్నారు. కొఠారి కమిషన్ ప్రభుత్వ రంగంలోనే విద్య కొనసాగాలని సూచించిందన్నారు. మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని కూడా నాశనం చేస్తోందన్నారు. కాషాయీకరణ, మతతత్వం పెరుగుతుండడం ప్రమాదకరమన్నారు. జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పోరాటాలు ఆమోదయోగ్యంగా ఉంటాయన్నారు. ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు మాట్లాతూ ఎస్ఎఫ్ఐలోకి కొత్తగా వచ్చినవారు తమ పాత నడవడికను, పద్ధతులను మార్చుకోవాలన్నారు. జెఎన్‌టీయూకే స్పోర్ట్స్ డైరెక్టర్ శ్యామ్, నాయకులు టి.రాజా పాల్గొన్నారు. అనంతరం అతిథులకు జ్ఞాపికలను అందజేశారు.

పిచ్చికుక్క స్వైర విహారం 14 మందికి గాయాలు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో గురువారం సాయంత్రం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 14 మందిని గాయాల పాలు చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కొనేరు వద్ద పిచ్చి కుక్క విచ్చలవిడిగా తిరుగుతూ అక్కడ గల 14 మందిని కరిచింది. బాధితులు వెంటనే పెద్దాడ ప్రాథమిక, పెదపూడిలోని సామాజిక ఆరోగ్యకేంద్రాలకు వెళ్లారు. వైద్యులు వెనువెంటనే బాధితులకు వైద్యం అందించి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేశారు.

గొల్లప్రోలులో..

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ 7వ వార్డులో గురువారం ఒక పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. దీంతో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కరిచింది పిచ్చి కుక్క కావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధురాలి మృతి



సుబ్బాయమ్మ (ఫైల్)

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెంకు చెందిన శెనగన సుబ్బాయమ్మ(100) గురువారం తెల్లవారు జామున మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మనవలు, మునిమనవలు అంతా కలిపి 40 మంది ఉన్నారు.

బంగారం దొంగకు ఐదేళ్ల 8 నెలల జైలు

గండేపల్లి: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను బెదిరించి బంగారు నగను దోపిడీ చేసిన వ్యక్తికి ఐదేళ్ల 8 నెలల శిక్ష పడినట్టు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు గురువారం తెలియజేశారు. ఆయన కథనం మేరకు మండలంలోని జెడ్ రాగంపేట ఆంధ్రబ్యాంక్ పైన గల పోర్షన్లో అద్దెకు నివాసం ఉంటున్న వారి ఇంట్లోకి ప్రవేశించిన శృంగరాయపాలెంకు చెందిన బొజ్జపు అనూరుద్ బాబా నీలం అనసూయను చాకుతో బెదిరించి మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాల తాడును తీసుకుపోయాడు. నవంబర్ 2018న జరిగిన ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా 30 నవంబర్ 2018 చార్జిషీట్ దాఖలుచేసి కోర్టుకు అందజేయగా కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో వివిధ సెక్షన్ల కింద ఐదేళ్ల 8 నెలల శిక్ష, 19,000 జరిమానా విధిస్తూ పెద్దాపురం కోర్టు తీర్పు ఇచ్చింది. నేరస్తుడిని సెంట్రల్ జైలుకు తరలించామని జేఎఫ్‌సీఎం కోర్టులలో ఇంత పెద్ద ఎత్తున శిక్ష పడటం ఇదే మొదటిసారని వివరించారు. సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టిన సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్సై వై.గణేష్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ టి.నాగార్జున్‌లను ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అభినందించినట్టు ఆయన పేర్కొన్నారు.

శ్రీలక్ష్మీ నృసింహుని హుండీల ఆదాయం రూ.4.54 లక్షలు

మధురపూడి: కోరుకొండలో వెలసిన స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీల లెక్కింపు గురువారం జరిగింది. దీంతో రూ.4,54,132 ఆదాయం స్వామివారికి వచ్చింది. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త ఎస్‌పీ రంగరాజు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం ఏఈఓ ఆనందకుమార్ ఆధ్వర్యంలో లెక్కింపు జరిగింది. దేవస్థానంలో కొండపైన, కింద 11 హుండీలున్నాయి. వీటన్నింటినీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ లెక్కించారు. అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ కిషోర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, కేతినీడి అశోక్, ఉప్పలపాటి వీరాస్వామి పాల్గొన్నారు.

6వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య



దీవెన (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లి శివారు రామారావుపేటకు చెందిన 6వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలిక సింగం దీవెన గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందింది. ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలిక తమ ఇంట్లో ఉన్న డబ్బు తీసుకుంది. ఇది చూసిన ఆమె తమ్ముడు, అక్కలు విషయం తండ్రికి చెబుతామని తెలపడంతో ఆమె భయపడి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర తెలిపారు.

'నన్నయ'లో జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

లైంగిక వేధింపులే కారణం




నిందితుడు గౌతంనాయుడు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జొన్నకూటి గౌతంనాయుడును వీసీ ఆచార్య కె.పద్మరాజు సస్పెండ్ చేశారు. యూనివర్సిటీలోనే పనిచేస్తున్న ఒక మహిళను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై అతనిని అరెస్టు చేసి, రిమాండ్‌కి పంపించారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీలో రెగ్యులర్ ఉద్యోగి అయిన అతనిని బుధవారం సస్పెండ్ చేశారు. సైన్స్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గౌతంనాయుడు ఏడాది క్రితం వరకు ఎగ్జామ్స్ విభాగంలో పనిచేసేవాడు. యూనివర్సిటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే స్వీపర్స్ ఉదయాన్నే 8 గంటలకు వచ్చి, గదులను తుడుస్తుంటారు. ఆ విధంగా విధులు నిర్వర్తిస్తున్న ఒక వివాహిత అయిన స్వీపర్‌పై కన్నేసిన గౌతంనాయుడు ఒకరోజు ఉదయం 8 గంటలకే చేరుకున్నాడు. ఆమె లోనికి వచ్చి గదిని తుడుస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చి తలుపులు వేసి, అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తాను రెగ్యులర్ ఉద్యోగినని, అరచినా, ఎవరికైనా చెప్పినా నీ ఉద్యోగమే పోతుందని బెదిరించాడు. ఆ బెదిరింపులకు తలొంచిన ఆమెతో ఏడాది కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 5న ఆరోగ్యం బాగోలేదని ఆమె విధులకు రాలేదు. దీంతో లాలాచెరువులో ఉండే ఆమె ఇంటికే నేరుగా వెళ్లి, తన ఆరోగ్యం బాగోలేదని వారిస్తున్నా వినకుండా మరోసారి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. జరిగిన సంఘటనలపై ఆమె తన భర్త సహకారంతో నవంబర్ 27న రాజానగరం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. రాజానగరం పోలీసులు ఈ కేసును రాజమహేంద్రవరం దిశ పోలీసు స్టేషన్‌కు బదలాయించారు. పరారీలో ఉన్న నిందితుడిని ఈనెల 17న తాడేపల్లిగూడెంలో అరెస్టు చేసి, రిమాండ్‌కి పంపించారు. దీంతో అతనిని సస్పెండ్ చేశారు. కాగా ఈ విషయమై వీసీ ఆచార్య కె. పద్మరాజును వివరణ కోరగా సస్పెండ్ చేసిన మాట వాస్తవమేనన్నారు.

రామాయణాన్ని మత గ్రంథంగా చూడవద్దు

సామవేదం షణ్ముఖశర్మ



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహర్షి వాల్మీకి ప్రసాదించిన రామాయణం జాతిని జాగృతం చేసే ధర్మశాస్త్రం, కేవలం మతగ్రంథంగా చూడవద్దని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. గురువారం హిందు సమాజంలో ఆయన 16వ రోజు ప్రవచనంలో రామ, భరతుల సంభాషణను వివరించారు. అయోధ్యకాండలో 100వ సర్గకు 'కచ్చిత్' సర్గ అని పేరు. ఈ సర్గ రాజనీతిశాస్త్ర సారాంశం, నాగరిక ప్రపంచానికి పనికి వచ్చే సార్వజనీన, సార్వకాలీన అంశాలు ఈ సర్గలో కనపడతాయి. అన్ని ఆధునిక మేనేజ్‌మెంట్‌లకు పనికి వచ్చేది ఈ సర్గ అని సామవేదం అన్నారు. 'కచ్చిత్' అన్న పదానికి 'కదా' అని అర్థమని, తన దగ్గరకు వచ్చిన భరతుడు రాజు కనుక, రాముడు భరతునికి అనేక రాజనీతికి సంబంధించిన అంశాలను ఆదేశ పూర్వకంగా కాక, సూచనప్రాయంగా నీవు వీటిని అమలు చేస్తున్నావు 'కదా' అని ప్రశ్నిస్తాడు. యజ్ఞయాగాదుల ద్వారా దేవతలను, సకాలంలో వేతనాలు ఇచ్చి భృత్యులను, వినయంతో జ్ఞాన వయోవృద్ధులను సేవిస్తున్నావు కదా? ప్రలోభాలకు లొంగని, ఎదుటి మనిషి అంతరంగాన్ని అంచనా వేయగల మంత్రులు నీ వద్ద ఉన్నారు కదా? ముఖ్యమైన నిర్ణయాలు ఒక్కడివే తీసుకోరాదు, అలా అని అందరితో బహిరంగంగా చర్చలు చేయడం లేదు కదా? నీ రహస్య మంత్రాంగం దేశం పొలిమేరలు దాటి పోరాదు, వేలాది మూర్ఖులతో కన్నా ఒక్క విద్వాంసునితో చర్చించడం చేస్తున్నావు కదా? తక్కువ వ్యయంతో సత్వర ప్రయోజనాలు కలిగించే ప్రణాళికలు అమలు చేస్తున్నావు కదా? అపరాధం స్థాయిని పట్టి శిక్షలు ఉండాలి, కోశాగారం నింపుకోవడానికి జరిమానాలు విధించడం లేదు కదా? నీవు అధికారంతో భోగలాలసుడివి కాలేదు కదా!...ఇలా రాముడు సోదరునితో అనేక రాజనీతి అంశాలు ప్రస్తావిస్తాడు. సుమారు 70 శ్లోకాలలో రాముడు సంధించిన వందకు పైగా ప్రశ్నలు ఉన్న ఈ సర్గను ఆధునిక సమాజంలో నాయకుడిగా ఎదగాలనుకుంటున్న వారు తప్పక అధ్యయనం చేయాలని అన్నారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల

ఏపీ ఓపెన్ స్కూల్ ఎంబ్లమ్

రాయవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా నిర్వహించే పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు షెడ్యూల్‌ను ఏపీ సార్వత్రిక విద్యాపీఠం డైరెక్టర్ కె.నాగేశ్వరరావు విడుదల చేశారు. పరీక్ష ఫీజుల విధి విధానాలు, పరీక్షల షెడ్యూల్‌ను ఏపీ సార్వత్రిక విద్యాపీఠం జిల్లా కోఆర్డినేటర్ పి.సాయివెంకటరమణ తెలిపారు. పరీక్ష ఫీజును అపరాధ రుసుం లేకుండా 2024 జనవరి 5 నుంచి 19వ తేదీ లోపు చెల్లించాల్సి ఉంది. అపరాధ రుసుం లేకుండా పదవ తరగతికి ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.5, పరీక్ష ఫీజుగా రూ.95 చెల్లించాలి. ఇంటర్‌కు ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.5, పరీక్ష ఫీజుగా రూ.145 చెల్లించాల్సి ఉంది. ప్రాక్టికల్ ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలి. ఉత్తీర్ణత సాధించని ఇంటర్మీడియెట్ విద్యార్థులు పాసైన సబ్జెక్టుల్లో ఇంప్రూవ్‌మెంట్‌కు థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.250, ఫెయిలైన సబ్జెక్టుకు రూ.150 వంతున ఫీజుగా చెల్లించాలి. ప్రాక్టికల్ ఒక సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలి. రూ.25 అపరాధ రుసుంతో జనవరి 20 నుంచి 27వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 4 నుంచి 9వ తేదీ వరకు తత్కాల్ రుసుంతో పదవ తరగతికి రూ.500, ఇంటర్‌కు రూ.1,000 అపరాధ రుసుంతో పాటు, ఆయా సబ్జెక్టులకు నిర్దేశిత పరీక్ష ఫీజును ఏపీ ఆన్‌లైన్, ఏపీఓఎస్ఎస్ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి 1,269 మంది, ఇంటర్‌లో చేరేందుకు 5,077 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరంతా పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంది.

పరీక్షల షెడ్యూల్ ఇదీ

ఓపెన్ స్కూల్ పరీక్షలు మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 30 నుంచి ఏప్రిల్ మూడవ తేదీ వరకు జరుగనున్నాయి.

నిర్ణీత గడువులోగా..



ఓపెన్ స్కూల్ ద్వారా ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులు పరీక్ష ఫీజును నిర్ణీత గడువులోపుగా చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా గాని లేదా ఓపెన్ స్కూల్ కేంద్రాల కోఆర్డినేటర్ల వద్ద గాని పరీక్ష ఫీజును చెల్లించాలి. సందేహాలు, ఇబ్బందులు తలెత్తినా 8977645704 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

– పి.సాయివెంకటరమణ, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్, అమలాపురం



